

# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక







సంపుటి: 3 సంచిక: 332 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు గురువారం, 24 సెప్టెంబర్ 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 332 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR THURSDAY, 24 SEPTEMBER 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


## కొత్తగా 4 కమిషనరేట్ల ఏర్పాటుకు 'గ్రీన్ సిగ్నల్'

### గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి
- మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్



తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి

**జగన్ పై మంత్రి ఫైర్ ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు"**

మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్**

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు**

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని

మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా

మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది.

కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు.



## దాడి పై గవర్నర్‌కు 'ఫిర్యాదు'

- విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్
- కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారని ఆరోపణ
- ప్రతి గ్రామంలో మంద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు

వైసీపీ అధినేత జగన్ ఈరోజు విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు.ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్లు, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.



2లో

## గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు



2లో

## తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్... జూరాలకు నీటి విడుదలకు ఓకే



2లో

## విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి నారా లోకేశ్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు

- రాష్ట్రవ్యాప్తంగా 963 పాఠశాలల్లో హార్ట్‌ఫుల్ యోగా శిక్షణకు చర్యలు
- టెన్త్, ఇంటర్‌లో 90% ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి
- పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ఉద్యోగ మేళాల నిర్వహణలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 963 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులకు 'హార్ట్‌ఫుల్ యోగా' శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సంస్థ ద్వారా 2,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నామని, ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో యోగా తరగతులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



2లో

## యాంత్రికంగా 'సర్' నోటీసులు

### ఈసీకి సుప్రీం అక్షింతలు

లక్షల్లో నోటీసులు పంపుతూ.. వాటి పరిష్కారానికి ఎంతమంది బీఎల్ఓలను నియమించారని ప్రశ్న



## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

- రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది .రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది.



2లో

## ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత

## రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్

- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్



2లో

# గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు



హైదరాబాద్: వినాయక నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25వ తేదీన (శుక్రవారం) జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. మొత్తం 28,400 మంది సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు. ఈ నెల 25న నిమజ్జనం ఉండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీన (రెండో శనివారం) పనిదినంగా పరిగణించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**నిమజ్జన ఏర్పాట్లపై సజ్జనార్**

నిమజ్జన ఏర్పాట్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగర పరిధిలో 20,000 మంది, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నిఘా కోసం అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నామని, 24 డ్రోన్లు, 10,000 సీసీటీవీ కెమెరాల ద్వారా నిమజ్జన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో 100 హై-రైజ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల కట్టడికి 25 క్రైమ్ బ్రాంచ్ బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్' నిఘాను ముమ్మరం చేశామని, ఊరేగింపుల్లో డీజేలు వినియోగం, మండపాల వద్ద అసభ్యకర పాటలు, నృత్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో పాత వీడియోలు లేదా తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని ప్రజలకు సూచించారు. ఖైరతాబాద్ గణనాథుని దర్శన గడువు నేటి (బుధవారం) అర్ధరాత్రితో ముగియనుంది. నిమజ్జనం రోజున నగరంలోకి ప్రైవేట్ బస్సులు, భారీ ట్రక్కుల ప్రవేశానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

## తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్... జూరాలకు నీటి విడుదలకు ఓకే



జూరాల కింద రైతుల ఇబ్బందులను వివరించిన మంత్రులు జూపల్లి, శ్రీహరితెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు. తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

**ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

## ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో: రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్



సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణజెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ

రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి నారా లోకేశ్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు

పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

ఉద్యోగ మేళాల నిర్వహణలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి, విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాలు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణకు మిషన్ మోడ్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. దీనికోసం అవగాహన, సంస్థాగత మద్దతు, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం 'కేర్ ఏపీ' అనే టూల్‌ను సిద్ధం చేశామని, పైలట్ ప్రాజెక్టు కూడా పూర్తయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 963 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులకు 'హార్ట్‌ఫుల్ యోగా' శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సంస్థ ద్వారా 2,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నామని, ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో యోగా తరగతులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పాఠశాల విద్యలో సంస్కరణల దశ ముగిసిందని, ఇకపై అధికారులంతా ఫలితాలపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని లోకేశ్ స్పష్టం చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. బోధనలో వెనుకబడిన ఉపాధ్యాయులకు మెంటార్ టీచర్లతో శిక్షణ తప్పనిసరి చేయాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఫ్రీ=రా) అమలు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన 'అక్షర ఆంధ్ర' ద్వారా వచ్చే ఏడాది చివరికల్లా నూరు శాతం అక్షరాస్యత సాధించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షించిన మంత్రి, పీఎం సేతు పథకం కింద పారిశ్రామికవేత్తల సహకారంతో తొలి విడతగా 10 పారిశ్రామిక అనుసంధానిత ఐటీఐ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. స్టీల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఆక్వా, ఫార్మా రంగాల సంస్థలతో సంప్రదించి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గత రెండేళ్లలో జాబ్ మేళాల ద్వారా 1.72 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని, మొత్తం 5.43 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని అధికారులు వివరించారు. ఇకపై జాబ్ మేళాల నిర్వహణలో శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శుక్రవారం హైదరాబాద్ లో వైన్ షాపులు, బార్లు బంద్




హైదరాబాద్ :పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 25న (శుక్రవారం) జరగనున్న ప్రధాన గణేశ్ మహా నిమజ్జనం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు ముఖ్యమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి. మహా నిమజ్జనం, భారీ శోభాయాత్రల వల్ల నగరంలో ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 25న తెలంగాణ హైకోర్టుతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబార్డినేట్ కోర్టులన్నింటికీ సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవుకు బదులుగా డిసెంబర్ 5వ తేదీ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రకటించారు. మరొకవైపు ప్రశాంత వాతావరణంలో వేడుకలు పూర్తి కావడానికి వీలుగా మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్ లో సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైన్ షాపులు, కల్లు కాంపౌండ్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు మాత్రం ఈ ఆంక్షల నుంచి మినహాయింపునిచ్చారు.

## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్



భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.

# యాంత్రికంగా 'సర్' నోటీసులు



దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కసరత్తులో భాగంగా ప్రజలకు యాంత్రికంగా నోటీసులు జారీ చేస్తున్నారనీ, ఈ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. సహేతుక వ్యత్యాసాల (లాజికల్ డిస్క్రిపెన్సీ)ను ఏ ప్రాతిపదికన గుర్తిస్తున్నారో స్పష్టీకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనల ధర్మాసనం ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది డీఎస్ నాయుడును ఆదేశించింది. "ప్రజలకు యాంత్రికంగా నోటీసులు జారీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అదనపు జాగ్రత్తలేవైనా తీసుకోవాలేమో చూడండి. లాజికల్ డిస్క్రిపెన్సీగా గుర్తించేందుకు ప్రాతిపదిక ఏదన్నది స్పష్టం కావాలి" అని ధర్మాసనం నిర్దేశించింది. నోటీసులు ఎవరికి జారీ చేశారో, వారికి ఎందుకు జారీ చేశారో తెలియజేయడంలో ఎన్నికల ప్రధానాధికారి, దిల్లీ ముఖ్య ఎన్నికల అధికారి విఫలమయ్యారని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఓటర్లను సహేతుక వ్యత్యాసాల కేటగిరీ కిందికి చేర్చేందుకు అనుసరిస్తున్న ప్రమాణాలు, అందుకు సంబంధించిన మాటల అర్థాలు, ఆల్గోరిథం సంబంధమైన ప్రమాణాలు, మార్గనిర్దేశకాలను వెల్లడించాలని కోరుతూ అంజలీ భరద్వాజ్, అమృతా జోహ్రీ అనే ఇద్దరు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణలో భాగంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. చిన్న చిన్న సాకులతో కేవలం దిల్లీలో 33 లక్షల మందికి నోటీసులు జారీ చేశారని పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించిన ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఈ నోటీసులు అందుకున్న వారు సహేతుక వ్యత్యాసాన్ని సవరించేందుకు కమిషన్ సూచించిన 12 డాక్యుమెంట్లలో ఒకటి సమర్పించాల్సి వస్తోందని, ఇది ఓటర్లకు ఇబ్బందులు సృష్టిస్తోందని ఆయన వాదించారు. పిటిషనర్లు తమ వాదనకు బలం చేకూర్చే వాస్తవ ఉదంతం ఒక్కటీ ప్రస్తావించలేదని, నోటీసులు ఇవ్వడానికి గల కారణాలను ఈసీ ఓటర్లకు తెలియజేస్తోందని ఈసీ న్యాయవాది డీఎస్ నాయుడు కోర్టుకు తెలిపారు. పిటిషనర్లు లేవనెత్తిన అనేక విషయాలపై ఎన్నికల సంఘం ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిందన్నారు. నోటీసులకు సంబంధించి చర్యలు తీసుకునేందుకు ఎందరు బీఎల్ఓలను నియమించారు అని ధర్మాసనం ప్రశ్నించింది. "మీరు 30 లక్షల నోటీసులు పంపారు. వాటి పరిష్కారానికి ఎందరు బీఎల్ఓలను నియమించారు?" అని న్యాయమూర్తులు అడిగారు. దాదాపు 15 వేల మంది బీఎల్ఓలు, 1200 మంది ఈఆర్ఓలు నియమించామని ఈసీ తరఫు న్యాయవాది విన్నవించారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

# గుంటూరు వార్తలు

గురువారం, 24 సెప్టెంబర్ 2026



# సర్కారు బడుల్లో పసి ప్రాణాల బలిపీఠం



అధికారుల నిర్లక్ష్యంతో పాతాళానికి విద్యా వ్యవస్థ !
పుస్తకాలు పట్టాల్సిన చేతులతో వాటర్ ట్యాంక్ క్లీనింగ్.. నిమ్మకు నీరెత్తిన విద్యాశాఖ!
'పెద్దవాళ్లం ఎక్కలేం.. పిల్లలే చేస్తారు' అంటూ సిబ్బంది అహంకారపూరిత సమాధానం
దొరికిపోయిన హెచ్ఎం, సిబ్బందిని కాపాడేందుకు ఎంఈఓ ల తాపత్రయం?
దామరపల్లి ప్రభుత్వ పాఠశాలలో దారుణంపై భగ్గుమంటున్న విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు !

**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు క్రమంగా బానిస శిబిరాలుగా మారిపోతున్నాయా అనే అనుమానాలు బలపడుతున్నాయి. పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన చదువు అందించాల్సిన ఉపాధ్యాయులు, వారిని పారిశుధ్య పనులకు, ప్రమాదకర పనులకు బలవంతంగా నెడుతున్నారు. గుంటూరు జిల్లా దామరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురు మైనర్ విద్యార్థులను ఏకంగా భవనంపైకి ఎక్కించి, ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకును కడిగించిన ఉదంతం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది.

**ప్రాణాలతో చెలగాటం.. నిధులు ఎవరి జేబుల్లోకి ?**

పాఠశాలల నిర్వహణ, శానిటేషన్, వాటర్ ట్యాంకుల క్లీనింగ్ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, ఆ నిధులను స్వాహా చేస్తూ చిన్నారుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ప్రమాదకర ఎత్తులో ఉన్న ట్యాంకులోకి పిల్లలను దింపి పనులు చేయిస్తుండగా చూసిన ఏఐఎస్ఎఫ్ బృందం అప్రమత్తమై పిల్లలను సురక్షితంగా కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. కనీస భద్రత లేకుండా పసి ప్రాణాలతో చెలగాటమాడుతున్న హెచ్ఎం, సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ మాత్రం కళ్లుండి చూడలేని గుడ్డిదానిలా వ్యవహరిస్తోంది.

**సిబ్బంది బరితెగింపు.. అధికారుల రక్షా కవచం:**

అమానవీయ ఘటనపై ప్రశ్నించిన నాయకులను ఉద్దేశించి "పైకి పెద్దవాళ్లు ఎక్కలేరు కాబట్టే పిల్లలతో చేయిస్తున్నాం" అని పాఠశాల సిబ్బంది నిర్లజ్జగా సమాధానమివ్వడం వ్యవస్థలోని బరితెగింపునకు నిదర్శనం. ఇంతటి దారుణం బయటపడినా మండల విద్యాశాఖ అధికారులు(ఎంఈఓ), నిందితులైన ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోకుండా దాటవేత ధోరణి ప్రదర్శించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉపాధ్యాయ సంఘాల లాబీయింగ్, రాజకీయ పలుకుబడితో తప్పు చేసిన వారిని కాపాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**చట్టాల ఉల్లంఘన.. చర్యలకు ఏఐఎస్ఎఫ్ డిమాండ్**



బాలల హక్కుల పరిరక్షణ చట్టం, విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఈ) నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థులను వెట్టిచాకిరీకి గురిచేసిన వారిపై కింది చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ (ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా సమితి డీఈవోకు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేసింది. దామరపల్లి పాఠశాల ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి నివేదికను బహిర్గతం చేయాలి. విద్యార్థుల ప్రాణాలను రిస్క్‌లో పెట్టిన ప్రధానోపాధ్యాయులు, బాధ్యులైన సిబ్బందిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, సర్వీస్ నుంచి సస్పెండ్ చేయాలి. పాఠశాలల పర్యవేక్షణ గాలికొదిలేసి నిందిలను వెనుకేసుకొస్తున్న విద్యాశాఖ అధికారులపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలి. జిల్లాలోని ఏ బడిలోనూ విద్యార్థులతో ఇలాంటి పనులు చేయించకుండా తక్షణమే కఠిన ఉత్తర్వులు జారీ చేయాలి. తప్పు చేసిన హెచ్ఎం, సిబ్బందిని కాపాడే ప్రయత్నం చేస్తే విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడించి, కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున నిరసనలకు దిగుతామని ఏఐఎస్ఎఫ్ హెచ్చరించింది.

# పారదర్శకంగా ఓటర్ల గుర్తింపు ప్రక్రియ : నగర కమిషనర్

**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల (జి.ఓ.ఆర్ టి.నెం.1165, ఎంఏడయు డిపార్ట్మెంట్) ప్రకారం గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని 76 డివిజన్లలో వార్డుల వారీగా రిజర్వేషన్ల ఖరారు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియ ఈ నెల 23 నుంచి ప్రారంభమైందని, ఈ మొత్తం ప్రక్రియను 23 నుండి అక్టోబరు 1 వరకు అత్యంత పారదర్శకంగా పూర్తి చేయనున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో వార్డ్ ల రిజర్వేషన్ ఖరారు సర్వే, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, విభాదిపతులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఈ షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబరు 23 నుండి 25 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేకంగా నియమించబడిన సర్వే సిబ్బంది వార్డులు, పోలింగ్ స్టేషన్ల వారీగా ఇంటింటికీ వచ్చి ఓటర్ల జాబితాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తిస్తారని తెలిపారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారంతో రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలను ఫారమ్-1 ద్వారా సెప్టెంబరు 26న నగర పాలక సంస్థ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజల పరిశీలన కోసం ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం, సెప్టెంబరు 27, 28 తేదీల్లో ప్రజల నుండి అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తామని, ఈ క్రమంలో పేర్ల నమోదు లేదా గుర్తింపు కోసం ఫారమ్-2లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల కోసం ఫారమ్-3లో దరఖా



స్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దాఖలైన క్లెయిమ్‌ల వివరాలను ఫారమ్-4 ద్వారా కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించడంతో పాటు, అభ్యంతరాలకు సంబంధించి ఫారమ్-5 ద్వారా సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం సెప్టెంబరు 29, 30 తేదీలలో వెరిఫికేషన్ అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారని, విచారణ పూర్తయిన తర్వాత, సవరించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మహిళా ఓటర్ల తుది జాబితాను ఫారమ్-6 రూపంలో అక్టోబరు 1న అధికారికంగా ప్రచురించి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన కమిషనర్ & డైరెక్టర్ కార్యాలయానికి సమర్పిస్తామని తెలిపారు. నగర ప్రజలందరూ తమ వివరాలను సరిచూసుకుంటూ ఈ సర్వే ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

**ఎన్నికల నిర్వహణపై కమిషనర్ మాట్లాడుతూ,** పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ లిస్టు మేరకు రిటర్నింగ్ అధికారులు వారి పరిధిలోని కేంద్రాల్లో నిర్దేశిత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మౌలిక వసతులను పరిశీలించి, ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటితో కలిపి నివేదిక ఇవ్వాలన్నారు. రిటర్నింగ్ అధికారులతో ఏఈలు సమన్వయం చేసుకోవాలని ఎస్ఈకి తెలిపారు. అదేవిదంగా వార్డ్ ల వారీగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను గుర్తించాలని, అవకాశం ఉన్న వరకు వార్డ్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా చూడాలన్నారు. బ్యాలెట్ బాక్స్ లను భద్రపరచే కేంద్రాలను ఫైనల్ చేయాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ అందించేందుకు టెండర్ సిద్దం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, పిఓ, ఏపిఓలకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో డిప్యూటీ కమిషనర్ భాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల విభాగంతో ఇతర విభాగాలను డిప్యూటీ కమిషనర్ -2 చేయాలన్నారు. అన్ని విభాగాధిపతులు ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై వ్రాత పూర్వక నివేదికలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, డిప్యూటీ కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిటి ప్లానర్ డి.రాంబాబు, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఏఓ తిరుపతి నాయుడు, మేనేజర్ బాలాజీబాషా, ఎన్నికలవిభాగ సూపరింటెండెంట్ పద్మ పాల్గొన్నారు.

# రూ.1,34,78,692 విలువైన చెక్కులను పంపిణి చేసిన ఎమ్మెల్యే గల్లా మాధవి





**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని, అరాచకం సృష్టించి లబ్దిపొందాలని చూస్తున్న వైసీపీ ఆటలు సాగవమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ క్యాలెండర్ సమావేశంలో భాగంగా డివిజన్ పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ నేతల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. అందినవినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు అతి త్వరలో జరగనున్న నేపథ్యంలో బూత్ స్థాయి నుంచి ప్రతి నాయకుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో అలజడులు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నిస్తున్నప్పటికీ వారి ఆటలు సాగవని అన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ శ్రేణులు ఎన్నికలకు పూర్తి స్థాయిలో సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా విజయవాడలో ఉపాధ్యాయులపై వైసీపీ ప్రభుత్వం చేపట్టిన దమనకాండను ఖండిస్తూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు.

**ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ :** అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి 83 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ.1,34,78,692 విలువైన చెక్కులను అందజేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఇప్పటి వరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 767 మంది లబ్ధిదారులకు రూ.10,60,30,615 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలియజేసారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని, ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా సుమేధ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం






**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపిపిసిబి), గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సుమేధ హైస్కూల్‌లో విద్యార్థులకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026, వ్యర్థాల వేరు చేయడం, నాలుగు బిన్ విధానం (ఫోర్-బిన్ సిస్టం), ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు తదితర అంశాలపై విద్యార్థులకు అవగా హన కల్పించారు. విద్యార్థులు తడి, పొడి, పునర్విని యోగ, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియో గాన్ని తగ్గించడం, పర్యావరణ పరి రక్షణ లో భాగ స్వాములు కావాలని అధికా రులు పిలుపునిచ్చా రు. విద్యార్థులు తమ ఇళ్ల లోనూ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమేధ హైస్కూల్ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ రెడ్డి, ఐటీసీ ఎమ్మెస్ కే ఫినిష్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ శైలజ, పర్యా వరణ విద్య కోఆర్డినేటర్ డి.తిరుపతి రెడ్డి, పాఠ శాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుంటూరు పోలీస్ కమిషనరేట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 60కి పైగా కీలక అంశాలకు ఆమోదం లభించింది. గుంటూరు సహా కర్నూలు, రాజమండ్రి, తిరుపతిలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అమరావతి గ్రామాల్లో మౌలిక వసతులకు రూ.1,548.98 కోట్లు, రాజధాని ఇన్ఫ్రా పనులకు అదనంగా రూ.644.98 కోట్లు కేటాయించింది. అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ పనులకు రూ.661 కోట్లు మంజూరయ్యాయి.

# గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు



**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దసరా, దీపావళి పండగల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంటూరు, విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చర్లపల్లి - శ్రీకాకుళం రైలు అక్టోబర్ 6 నుంచి, నర్సాపూర్ - చర్లపల్లి రైలు అక్టోబర్ 4 నుంచి, తిరువణ్ణామలై - నర్సాపూర్ రైలు అక్టోబర్ 5 నుంచి నవంబర్ నెలాఖరు వరకు నడుస్తాయి. ఈ రైళ్లకు నల్గొండ, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, భీమవరం, తెనాలి తదితర స్టేషన్లలో హాల్టింగ్ ఉంది.

# సెప్టెంబర్ 26 జరుగు వాహనాల వేలం వాయిదా : కె.సీతారామిరెడ్డి




**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సెప్టెంబర్ 26వ తేదిన నిర్వహించవలసిన వాహనముల వేలం అనివార్య కారణములచేత వాయిదా వేయడమైనదని ఉప రవాణా కమిషనర్ కె. సీతారామిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున గమనించవలసిందిగా ఆయన కోరారు.

# ఎస్ఆర్పిఎం-బిడిపిఎల్ స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ నెం. 17 శాశ్వతంగా మూసివేత



**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దక్షిణ తీర రైల్వే, గుంటూరు డివిజన్, సిరిపురం(ఎస్ఆర్పిఎం) మరియు బండారుపల్లి (బిడిపిఎల్) రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న లెవెల్ క్రాసింగ్ నెం.17ను, 23 సెప్టెంబర్, గురువారం మధ్యాహ్నం గం. 03:00ల నుండి శాశ్వతంగా మూసి వేస్తోంది. ఈ లెవెల్ క్రాసింగ్ ఇకపై రోడ్డు వినియోగదారులకు అందుబాటులో ఉండదని ప్రజలకు తెలియజేయడమైనది. రోడ్డు వినియోగదారులు మూసివేసిన లెవెల్ క్రాసింగ్ వద్ద రైల్వే ట్రాక్‌లను దాటడానికి ప్రయత్నించవద్దని మరియు సురక్షిత ప్రయాణం కోసం నిర్దేశించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని కోరడమైనది. రైల్వే భద్రతా చర్యలలో భాగంగా ఈ శాశ్వత మూసివేత చేపట్టబడింది. ప్రజల భద్రత మరియు సౌకర్యం కోసం, నిర్దేశించిన ఆర్యుబి మరియు ఎల్ హెచ్ ఎస్ సదుపాయాలను ఉపయోగించుకోవడంలో సహకరించాలని రైల్వే వారు విజ్ఞప్తి చేశారు.

## భారీ వర్షాలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సమాచారాన్ని తెలుసుకోవచ్చని, ప్రజలు కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పాటు అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## కొత్తవలస మండలంలో జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి రాజీనామా



**కొత్తవలస, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలో వైఎస్ఆర్సిపి పార్టీకి బిగ్ షాక్ తగిలింది. కొత్తవలస మండలంలో వైయస్సార్ పార్టీకి మరియు జడ్పిటిసి పదవికి నెక్కల శ్రీదేవి బుధవారం రాజీనామా చేశారు. మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి పార్టీలోకి వెళ్తున్నామని నెక్కల శ్రీదేవి తెలిపారు. కొన్ని వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా చేయడం జరిగిందని తెలియజేశారు. అలాగే తదుపరి కార్యాచరణగా ఇటీవల టిడిపిలో చేరిన మజ్జి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తామని వెల్లడించారు.

## భావన డయా బెస్ట్ రైస్ ఘనంగా ప్రారంభం

గుంటూరు నల్లచెరువు లో ఘనంగా భావన డయా బెస్ట్ రైస్ ప్రారంభం
భావన డయా రైస్ కు విశేష ఆదరణ
మిల్లెట్స్ బ్రౌన్ రైస్ కంటే తక్కువ షుగర్ కంటెంట్ : చైర్మన్ సుధీర్



**గుంటూరు, 23 సెప్టెంబరు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మిల్లెట్స్ బ్రౌన్ రైస్ కంటే తక్కువ షుగర్ కంటెంట్ ఉన్నట్లు శాస్త్రీయంగా నిరూపణ అయిందని సంస్థ చైర్మన్ సుధీర్ తెలిపారు. ప్రస్తుతం ఈ రైస్ కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు.గుంటూరు నల్లచెరువు 13 లైన్ మెయిన్ రోడ్ లో శ్రీ దుర్గా ట్రేడర్స్ భావన డయా బెస్ట్ రైస్ 246 బ్రాంచ్ ని నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది.బుధవారం ఈ బ్రాంచ్ ని చైర్మన్ సుధీర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ గుంటూరు జిల్లా అంతటా సూపర్ స్టాకిస్ట్ పాయింట్ గా ఈ బ్రాంచ్ ఉంటుందన్నారు. ఇక ఈ రైస్ ప్రత్యేకత గురించి వివరించాలంటే ఇండియన్ బ్రీడ్స్‌ను మరియు ఫారిన్ బ్రీడ్స్ ను క్రాస్-బ్రీడ్ చేసి శాస్త్రీయంగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ వంటి సంస్థల రిపోర్టుల ఆధారంగా, హైకోర్టు అనుమతితో సైంటిస్టులు, 84 మంది డయాబెటిక్ పేషెంట్ల పై రీసెర్చ్ చేసిన తరువాతే ఈ రైస్ ను మార్కెట్ లో విడుదల చేశామన్నారు. ప్రస్తుతం దీని ధర కేజీకి 120 రూపాయలగా ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లో సాగు మరింత పెరిగితే భవిష్యత్తులో ధర తగ్గే అవకాశం ఉందని వివరించారు.

# పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండ

శాసనసభ్యులు వనమాడి కొండబాబు



**కాకినాడ బ్యూరో, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, పేద ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి, ఆపద సమయంలో అండగా నిలిచి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసన సభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. బుధవారం శాసన సభ్యులు వారి స్వగృహం జగన్నాథపురం నందు నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ సిటీ నియోజకవర్గం స్థానిక 18వ డివిజన్ కి చెందిన గాదం మధుసూదన్ రావు కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన సుమారు 5,03,071 రూపాయల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈసందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి, ఆపద సమయంలో అండగా నిలుస్తుందని, ఏ కుటుంబానికైనా అనారోగ్య సమస్య వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే, ప్రభుత్వ సహాయాన్ని అందేలా చేసి ప్రతి కుటుంబానికి అండగా నిలబడడం జరుగుతుందని పేర్కొన్నారు.

**బాధిత కుటుంబసభ్యులు గాదం మధుసూదన్ రావు మాట్లాడుతూ** సీఎం సహాయనిధి ద్వారా తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి, తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన శాసనసభ్యులు వనమాడి కొండబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ బొడ్డు శివాజీ, మేరేటి బ్రహ్మాస్వామి, పినపోతు శివ, సింహాద్రి, నరసింహస్వామి, మోస తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను నేపథ్యంలో గణేష్ నిమజ్జన ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ





**కాకినాడ బ్యూరో, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వర్షంలోనూ బందోబస్తు విధుల్లో పోలీసు సిబ్బంది చీకటి పడేలోపే నిమజ్జనాలు పూర్తి చేయాలని అధికారులకు ఎస్పీ సూచనలు గత ఏడాది చీకటి పడే లోపు 40 శాతం నిమజ్జనాలు పూర్తయితే ఈ సంవత్సరం 60 శాతం నిమజ్జనాలు పూర్తయినాయి. కాకినాడ జిల్లాలో తుఫాను ప్రభావం దృష్ట్యా గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు సురక్షితంగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిమజ్జన ఘాట్లు, ప్రధాన కూడళ్లు, ఊరేగింపు మార్గాల్లో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ బుధవారం కాకినాడలోని జగన్నాథపురం బ్రిడ్జి, బ్రహ్మంగారి మఠం, బలరాం సెంటర్, డ్రై ఫిష్ మార్కెట్ వద్ద గల గణేష్ నిమజ్జన ఘాట్లను స్వయంగా పరిశీలించారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనాలు త్వరితగతిన పూర్తయ్యేలా పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,150 గణేష్ విగ్రహాల నిమజ్జనాల నిర్వహణకు బందోబస్తు విధుల్లో ఇద్దరు అదనపు ఎస్పీలు, ఇద్దరు డీఎస్పీలు, 20 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 34 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 74 మంది ఏఎస్ఐలు /హెడ్ కానిస్టేబుళ్లు, 171 మంది కానిస్టేబుళ్లు/మహిళా పోలీసు సిబ్బంది, 121 మంది హోంగార్డులు, 68 మంది క్యూఆర్టీ సిబ్బందిని కేటాయించారు. వీరంతా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. పోలీసు శాఖ ముందస్తు ప్రణాళిక, సమన్వయంతో చేపట్టిన చర్యల ఫలితంగా బుధవారం చీకటి పడేలోపే జిల్లాలో సుమారు 60 శాతం గణేష్ విగ్రహాల నిమజ్జనం పూర్తయింది. గత ఏడాది ఇదే సమయానికి సుమారు 40 శాతం విగ్రహాల నిమజ్జనం మాత్రమే పూర్తయినట్లు అధికారులు గుర్తుచేశారు. నేడు (24.09.2026) కూడా తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున గణేష్ ఉత్సవ మండపాల నిర్వాహకులు, కమిటీ పెద్దలు, భక్తులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది. నిమజ్జనాలను వీలైనంత త్వరగా, తప్పనిసరిగా చీకటి పడేలోపే పూర్తి చేసేలా ముందస్తు ప్రణాళికతో సహకరించాలని, ఊరేగింపుల్లో అనవసర జాప్యం చేయకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేయాలని తెలిపారు.

# ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ ఆత్మీయ సత్కార సభ



**కాకినాడ బ్యూరో, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్తు చైర్మన్ విప్పర్తి వేణు గోపాల రావు అధ్యక్షతన జి.ఎం.సీ బాలయోగి జిల్లా ప్రజా పరిషత్తు సమావేశ మందిరం లో " ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్తు ఆత్మీయ వీడ్కోలు,సత్కార సభ సమావేశం జరిగింది .జిల్లా ప్రజా పరి షత్ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ కుడిపుడి సూర్య నారాయణ,వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు,మేరుగు పద్మలత, రొంగల పద్మలత, ఆయా మండలాల జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, జెడ్ పిసిఈఓ మరియు జెడ్పిటిసిలచే ఘనంగా జిల్లా ప్రజా పరిషత్తు చైర్మన్ విప్పర్తి వేణు గోపాల రావును సన్మానించి సత్కరించారు. ప్రజాసేవే పరమావధిగా అభివృద్ధికి పునరంకితం కావాలి. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సమాజంలో ప్రజాసేవే అత్యున్నతమైనదని, 'మానవ సేవే మాధవ సేవ అనే భావనతో ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సాధారణ,ఆత్మీయ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసిన జిల్లాపరిషత్ చైర్మన్, సీఈవో, డిప్యూటీ సీఈవో, డిప్యూటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు మరియు జిల్లా పరిషత్ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. గత ఐదేళ్ల కాలంలో అనేక సమస్యలు ఎదురైనప్పటికీ, ప్రజాప్రతినిధులందరూ తమ వంతు బాధ్యతగా తీవ్రంగా కృషి చేసి ప్రజలకు సంక్షేమఫలాలు అందించారని, చాలామంది లబ్ధిదారులు దీని ద్వారా ప్రయోజనం పొందారని ప్రశంసించారు. ప్రజాసేవను భవిష్యత్తు లోనూ ఇలాగే కొనసాగించాలని, జెడ్పీటీసీలు గానే కాకుండా ప్రజా ప్రతినిధులుగా తదుపరి స్థాయి లైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై స్పందిస్తూ, కరోనా మహమ్మారి వల్ల రెండు విలువైన సంవత్సరాలను కోల్పోవాల్సి వచ్చిందని, దాని ప్రభావం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్రంగా పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆర్థికంగా వెనుకబడ్డామని, గత 10 ఏళ్లుగా ఈ పరిస్థితి కొనసాగుతోందని వివరించారు. రాష్ట్రం సొంత కాళ్లపై నిలబడటానికి మరో 5 నుండి 10 సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, 2014 తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిరంతర కృషితో ముందుకు సాగుతున్నామని, రాబోయే 5 నుండి 10 ఏళ్లలో ఆశించిన స్థాయి ఆదాయాన్ని సమకూర్చుకోగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.ఆదాయం పెరిగిన కొద్దీ ప్రజలకు కావలసిన అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల మంజూరుకు అవసరమైన పూర్తి స్థాయి నిధులు కేటాయించే వీలు కలుగుతుందని, సమయం పట్టినప్పటికీ ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు.రాజకీయ పార్టీలకు అతీతంగా, ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా సభ్యులందరూ కలిసికట్టు గా సమస్యలను ప్రతిపాదించి చర్చించడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు.జెడ్పీ సమావేశాల్లో సభ్యులు ఎంతో ఐక్యతతో, సానుకూల వాతావరణంలో కార్యాచరణ సాగించడాన్ని ప్రత్యక్షంగా గమనించానని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇదే ప్రజాసేవా దృక్పథంతో, అధికారులతో పూర్తి స్థాయిలో సమన్వయం చేసు కుంటూ ప్రజలకు మరింత మేలు జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యులు వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సమావేశం లో భాగంగా జడ్పీ వైస్ చైర్మన్ లకు, జెడ్ పి టి సి సభ్యులకు సన్మాన కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ సత్య నారాయణ, జెడ్పీ సీఈవో లక్ష్మణ రావు, డిప్యూటీ సిఈఓ డి. శ్రీలలిత, జెడ్పిటిసి సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దక్షిణ కోస్తా రైల్వే నూతన జోన్ అభివృద్ధికి సమగ్ర చర్యలు చేపట్టాలి

కామ్రేడ్ డా. సి.హెచ్. శంకర్ రావు




**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దక్షిణ కోస్తా రైల్వే నూతన జోన్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, రైల్వే ఉద్యోగులకు మరియు ప్రజలకు మెరుగైన రైల్వే సౌకర్యాలు కల్పించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొనిదెల పవన్ కళ్యాణ్ మరియు రైల్వే ఉన్నత అధికారులకు దక్షిణ కోస్తా రైల్వే యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డాక్టర్ సిహెచ్ శంకర్రావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ దక్షిణ కోస్తా రైల్వే నూతన జోన్ అక్టోబర్ ఒకటో తేదీ నుంచి విశాఖ కేంద్రంగా అమల్లోకి రావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్ష అని ముఖ్యమైన ముందడుగు అన్నారు ఈ నూతన జోన్ ద్వారా రైల్వే పరిపాలన మరింత సమర్థవంతంగా జరిగేలా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు రైల్వే అభివృద్ధి అందేలా చర్యలు తీసుకో వలసిన అవసరం ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా క్రింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కామ్రేడ్ డా. సి.హెచ్. శంకర్ రావు వినమ్రంగా విజ్ఞప్తి చేశారు.

**1. నూతన జోన్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు**
విశాఖపట్నంలో జోనల్ హెడ్‌క్వార్టర్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు, ఉద్యోగులు మరియు వారి కుటుంబాలకు అవసరమైన క్వార్టర్స్, ఆఫీసులు, పాఠశాలలు, హాస్టళ్లు, కమ్యూనిటీ హాళ్లు మరియు ఇతర మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి.

**2. కొత్త రైళ్లు – కనెక్టివిటీ విస్తరణ**
ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాలు, పోర్టులు మరియు పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ కొత్త ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ, మెము/ప్యాసింజర్ రైళ్లను ప్రవేశపెట్టాలి. ఇప్పటికే నడుస్తున్న ముఖ్యమైన రైళ్లకు అదనపు సర్వీసులు, అదనపు కోచ్‌లు మరియు అవసరమైన చోట్ల కొత్త స్టాపేజీలు కల్పించాలి.

**3. రైల్వే ఉద్యోగులకు వైద్య సదుపాయాలు**
రైల్వే ఆసుపత్రులు, డివిజనల్ హాస్పిటల్స్ మరియు హెల్త్ యూనిట్లను ఆధునీకరించాలి. అవసరమైన స్పెషలిస్ట్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆధునిక డయాగ్నస్టిక్ పరికరాలు, ICU, అత్యవసర వైద్యం మరియు మెరుగైన మందుల సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలి.

**4. ఉద్యోగావకాశాలు మరియు కొత్త పోస్టులు**
నూతన జోన్ మరియు కొత్త డివిజన్ల ఏర్పాటుతో ఏర్పడే అదనపు పనిభారానికి అనుగుణంగా అవసరమైన కొత్త పోస్టులను మంజూరు చేసి, రైల్వే ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి. స్థానిక యువతకు రైల్వేలో లభించే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించాలి.

**5. ఉద్యోగుల బదిలీలు మరియు సీనియారిటీ సమస్యలు**
నూతన జోన్ పునర్వ్యవస్థీకరణ కారణంగా ప్రభావితమయ్యే ఉద్యోగులకు న్యాయమైన ఆప్షన్, బదిలీ మరియు పోస్టింగ్ అవకాశాలు కల్పించాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పరస్పర బదిలీలు, ఇంటర్-డివిజనల్ మరియు ఇంటర్-జోనల్ బదిలీ సమస్యలను పరిష్కరించాలి.

**6. రైల్వే ఉద్యోగుల కుటుంబ సంక్షేమం**
ఉద్యోగుల పిల్లలకు విద్యా సదుపాయాలు, క్రీడా సదుపాయాలు, మహిళా ఉద్యోగులు మరియు కుటుంబాల కోసం అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను విస్తరించాలి.

**7. ప్రయాణికుల సౌకర్యాలు**
ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫారాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, వెయిటింగ్ హాళ్లు, పార్కింగ్ మరియు దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలను మెరుగుపరచాలి.

**8. రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి**
పెరుగుతున్న ప్రయాణికులు మరియు సరుకు రవాణాకు అనుగుణంగా డబ్లింగ్, ట్రిప్లింగ్, నాలుగో లైన్, బైపాస్ లైన్లు, యార్డుల ఆధునీకరణ, గూడ్స్ షెడ్లు మరియు టెర్మినల్ సదుపాయాలను విస్తరించాలి.

**9. ఆంధ్రప్రదేశ్‌లో సమతుల్య రైల్వే అభివృద్ధి**
ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలన్నింటికీ సమాన ప్రాధాన్యతనిస్తూ కొత్త ప్రాజెక్టులు, రైళ్లు, స్టాపేజీలు మరియు ప్రయాణికుల సదుపాయాలను కల్పించాలి.

**10. ప్రజలు-రైల్వే ఉద్యోగుల సమన్వయం**
రైల్వే అభివృద్ధికి సంబంధించిన ప్రజా సమస్యలు, ఉద్యోగుల సమస్యలు మరియు ప్రాంతీయ అవసరాలను సంబంధిత రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ఉద్యోగ సంఘాలతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

**మా ప్రధాన విజ్ఞప్తి :** దక్షిణ కోస్తా రైల్వే నూతన జోన్‌ను కేవలం పరిపాలనా పునర్వ్యవస్థీకరణగా కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, రైల్వే ఉద్యోగుల సంక్షేమానికి, ప్రయాణికుల సౌకర్యాల విస్తరణకు మరియు కొత్త ఉద్యోగ అవకాశాల సృష్టికి ఒక ముఖ్యమైన అవకాశంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరియు రైల్వే ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పై అంశాలపై ప్రత్యేకంగా పరిశీలించి, అవసరమైన నిధులు, పోస్టులు, రైళ్లు మరియు మౌలిక సదుపాయాలను మంజూరు చేయాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాము.

# మంత్రి నారాయణ కు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సవాల్



**నెల్లూరు జిల్లా, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మంత్రి నారాయణ గత మూడు సంవత్సరాలుగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై ఆరోపణలు చేస్తున్నారు. ప్రధానంగా ఆయన చేస్తున్న ఆరోపణ ఏమిటంటే గత వైసిపి ప్రభుత్వం చెత్తను తొలగిస్తామని చెప్పి చెత్త పన్ను వేసి సుమారు 83 లక్షల టన్నుల చెత్తను ఈ రాష్ట్రంలో వదిలిపెట్టి వెళ్లిందని చెబుతున్నారు. భూమి లోపల ఉన్న చెత్తను తొలగించే క్రమంలో 1.63 లక్షల టన్నుల చెత్తను కూటమి ప్రభుత్వం తొలగించిందని మంత్రి నారాయణ చెప్పుకుంటున్నారు. ఈ చెత్త తొలగింపులో జరిగిన అవినీతికి సంబందించి గత వారం రోజులుగా మీకు నేను కొన్ని ప్రశ్నలు వేయడం జరిగింది. అందులో మొట్ట మొదటిది మీరు చేసిన ఆరోపణ పూర్తి అవాస్తవం, అబద్ధమని చెప్పడం జరిగింది. రెండవది ఈ రాష్ట్రంలో చెత్త పేరుతో సుమారు 1200 కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని కూడా నేను తెలియజేయడం జరిగింది. నెల్లూరు నగరంలో సామాన్యుల గొంతు పిండి వారి వద్ద నుంచి పన్నుల రూపంలో దోపిడీ చేసి మీ అన్యులకి, మీకు సంబంధించిన వారికి కోట్ల రూపాయలు కట్టబెట్టినట్లుగా వాస్తవాలతో సహా మీ ముందుకు వచ్చి చూపించడానికి నేను సిద్ధంగా ఉన్నట్లు చెప్పడం జరిగింది. ఈ విషయం మీద చర్చించేందుకు గత వారం రోజులుగా మీరు ఎక్కడికి చెబితే అక్కడికి వచ్చి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని చెబుతున్నా. ఒకవేళ నేను చేసిన ఈ మూడు ఆరోపణలను నిరూపించ లేకపోతే మీకు నేను బహిరంగ క్షమాపణ చెప్పి శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నానని తెలియజేస్తున్నాను. నేను చేసిన మూడు ఆరోపణలు నిజమని నిరూపిస్తే మీరు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెబుతారా అని నారాయణను ప్రశ్నిస్తున్నాను. బహిరంగ క్షమాపణలు చెప్పడమే కాదు మీరు రాజకీయాల నుంచి శాశ్వతంగా దూరమవుతారా సమాధానం చెప్పాలని మంత్రి నారాయణను అడుగుతున్నా. నేను చెప్పిన అంశాలపై ఏ రోజైనా సరే బహిరంగ చర్చకు నేను సిద్ధమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మీకు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని మంత్రి నారాయణ కోరుతున్నా. మీరు బహిరంగ చర్చకు రాలేకపోయినా ఇందుకు సంబందించిన వాస్తవ ఆధారాలను త్వరలో మీడియా ద్వారా ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

# సోమిరెడ్డి బ్రతుక్కి జగన్ పై విమర్శలా : కాకాణి గోవర్ధన్ రెడ్డి

సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి బతుకంతా
అవినీతి, అక్రమాలేనని కాకాణి ధ్వజం.
చదువు, సంధ్య లేని సోమిరెడ్డికి డిఎస్సి పై
మాట్లాడే అర్హత లేదన్న కాకాణి
ప్రాథమిక పాఠశాల నుంచే పుస్తకాల
దొంగతనాలకు పాల్పడిన వ్యక్తికి ఉద్యోగాల
కష్టం ఏం తెలుసని కాకాణి ఎద్దేవా
స్పోర్ట్స్ కోటా అక్రమాలు, ఉద్యోగాల
విక్రయాలపై విచారణకు వెనుకాడే కూటమి
ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోంది
నైతిక విలువలు లేని సోమిరెడ్డి, జగన్ మోహన్
రెడ్డి పై విమర్శలు చేయడం సిగ్గుచేటు





**నెల్లూరు జిల్లా, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పత్రికా విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సోమిరెడ్డి బతుక్కి జగన్ పై విమర్శలు చేయడం సిగ్గుచేటు, చదువు, సంధ్య, విద్య విలువ తెలియని సోమిరెడ్డికి డిఎస్సి లో జరిగిన అవకతవకలపై మాట్లాడే నైతిక హక్కు ఎక్కడుందని కాకాణి ప్రశ్నించారు. చిన్నప్పటి నుంచే ప్రాథమిక పాఠశాలలో పుస్తకాల దొంగతనాలకు పాల్పడిన సోమిరెడ్డికి, కష్టపడి చదివితే ఉద్యోగం ఎలా వస్తుందో, ఆ విద్య విలువ ఏంటో ఏం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. డీఎస్సీలో ఉద్యోగాలు అమ్ముకోవడం, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలకు పాల్పడటం కళ్లముందే కనిపిస్తున్నా విచారణకు వెనుకాడటం తగదని అన్నారు. నైతిక విలువలకు కట్టుబడి లోకేష్ రాజీనామా చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై గుండాలతో దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో జరిగిన అక్రమాలకు సిగ్గుతో తలదించు కోవాల్సిన కూటమి నాయకులు డైవర్షన్ కోసం రకరకాలుగా మాట్లాడుతున్నారన్నారు.తమ అవినీతి, అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే జగన్ మోహన్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారని, జగన్ కాలి గోటికి కూడా సోమిరెడ్డి సరిపోరని అన్నారు. పేదల గృహ నిర్మాణాలు, గ్రామీణ రీ-సర్వే అంశాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన్ని ప్రస్తా విస్తూ కాకాణి కూటమి ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు.

**జగనన్న లేఅవుట్లపై సోమిరెడ్డి అరాచకాలు స్థానిక ఎన్నికల వేళ సోమిరెడ్డి కొత్త నాటకాలు :** త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం కొత్త నాటకాలకు తెరతీశారని కాకాణి మండిపడ్డారు. ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందాలనే కుట్రతోనే పేదల ఇళ్ల స్థలాలు, రీ-సర్వే అంశాలను వాడుకుంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

**పేదల ఇళ్లపై సోమిరెడ్డి కన్ను పట్టాల రద్దుకు కుట్ర :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రతి గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా 'జగనన్న కాలనీలు' ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేశారని కాకాణి గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గం లో జగన్న కాలనీలకు సంబంధించి ఒక్క ఇంటికి కూడా మంజూరు (శాన్షన్) ఇవ్వలేదని విమర్శించారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను అడ్డుకోవడమే కాకుండా, వారు ఇళ్లు కట్టుకోకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జగన్ హయాంలో పేదలకు ఇచ్చిన స్థలాలలో సోమిరెడ్డి వారిని ఇల్లు కట్టుకొనివ్వకుండా, వారి అనుచరుల చేత బెదిరిస్తూ, ప్లాట్లను రద్దు చేసి, ఆ స్థలాలను టిడిపి నాయకులకు కట్టబెట్టేందుకు బారీ కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఈ అక్రమాలపై ఇప్పటికే న్యాయస్థానాలను ఆశ్రయించామని, కోర్టులు కూడా ప్రభుత్వ చర్యలపై స్టే (నిలిపివేత ఉత్తర్వులు) ఇచ్చాయని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, సిగ్గు, శరం లేకుండా మళ్లీ ప్లాట్లను రద్దు చేయడానికి సోమిరెడ్డి ప్రయత్నిస్తున్నారని, అదే జరిగితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామాల్లో జగనన్న కాలనీల వద్ద భారీ ఆందోళనలు చేపడతామని కాకాణి హెచ్చరించారు. అధికారులపై విచారణకు డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో రీ-సర్వే అక్రమాలపై పూరి స్థాయి విచారణ జరుపుతామని, నిబం ధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. "అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పనిచేస్తూ అక్రమాలకు సహ కరిస్తే తీవ్ర పర్యవసానాలు ఉంటాయి. అధికారం మారిన తర్వాత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కాదు కదా, చివరికి చంద్రబాబు నాయుడు కూడా మిమ్మల్ని కాపాడలేరు" అని అధికా రులను కాకాణి తీవ్రంగా హెచ్చరించారు. భూమిపై హక్కు ఉన్న వారికి కాకుండా వేరే వారికి అనుకూలంగా సర్వే చేస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు.

**కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అధ్వానంగా తయారయ్యాయి :** కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, అభివృద్ధి అనేది ఎక్కడా కనిపించడం లేదని కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. గ్రామాల్లో పర్యటిస్తుంటే రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోందని, కనీస పారిశుధ్య నిర్వహణ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లు వెలగడం లేదని, తాగునీటి ఎద్దటి తీవ్రంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవినీతి తప్ప ఎక్కడా అభివృద్ధి జాడ కనిపిచడం లేదని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు తమ పదవీ కాలం ఉన్నంతవరకు గ్రామాలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకున్నారని గుర్తుచేశారు. నేడు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారుల పరిపాలన తేవడంతో అధికారులు చేతులెత్తేశారని మండిపడ్డారు.

**సొంత నిధులతో వైఎస్సార్‌సీపీ నాయకుల సేవలు :** అధికారంలో లేకపోయినా, ఎలాంటి నిధులు అందుబాటులో లేకపోయినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు సామాజిక బాధ్యతగా భావించి తమ సొంత నిధులతో గ్రామాల్లో కనీస వసతులు, మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్నారని తెలిపారు. అధికారం, నిధులు చేతిలో పెట్టుకుని కూడా ప్రజలకు ఏమీ చేయలేకపోతున్న కూటమి ప్రభుత్వ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు చేస్తున్న సేవలను చూసి సిగ్గుతో తలదించుకోవాలని కాకాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాకాణి పర్యటనలో భాగంగా చెన్నారెడ్డిపాలెంలో కోడూరు సుందర రామిరెడ్డికి నివాళులర్పించారు. తిరుమలమ్మపాలెంలోఇటీవల మృతి చెందిన ముంగర వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు

# స్థానిక పోరులో 'కూటమి' ప్రభంజనం ఖాయం




బుచ్చిరెడ్డిపాళెం 28 వార్డుల్లో
మనమే గెలవాలి
మంత్రి నారా లోకేష్ పర్యటన విజయవంతం
చేసిన కేడర్‌కు అభినందనలు
ప్రతి కార్యకర్తా ధైర్యంగా
ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడగాలి
అభ్యర్థి ఎవరైనా విభేదాలు పక్కనబెట్టి కూటమి
విజయమే లక్ష్యంగా ఒక్కటై పనిచేయాలి
పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయ
సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు జిల్లా, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇటీవల కోవూరులో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన అత్యంత విజయవంతం కావడంపై కేడర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో పర్యటనలో దొర్లిన చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకుంటూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దిశా నిర్దేశం చేశారు. 'మైటీడీపీ యాప్' ద్వారానే నాయకులు, కార్యకర్తల పనితీరు అంచనా: ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పార్టీలో ప్రతి ఒక్కరి పనితీరును పారదర్శకంగా అంచనా వేసేందుకు అధిష్టానం 'మైటీడీపీ' యాప్‌ను ఉపయోగిస్తోందని తెలిపారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్య క్రమాన్ని, కేడర్ భాగస్వామ్యాన్ని తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నందున, నాయ కులందరూ 'మై టీడీపీ' యాప్ వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, అవసరమైతే తెలిసిన నాయకుల వద్ద శిక్షణ తీసుకోవాలని సూచించారు.



నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో స్థానిక ఎన్నికలు మొదలైనా, అది తమ సొంత బాధ్యతగానే భావించి నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**బుచ్చిరెడ్డిపాళెం ను క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యం:** మొదటగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందరూ తమ సొంత ప్రాంతంగా భావించి కష్టపడాలని ఎమ్మెల్యే సూచించారు. మున్సిపాలిటీలోని 28 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులే గెలిచేలా కృషి చేయాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు మంచి చేయడం తప్ప ఎలాంటి తప్పులు చేయలేదని, ఈ విషయాన్ని ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ రోజురోజుకూ దిగజారిపోతున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కంటే దోచుకున్న కమీషన్లే ఎక్కువని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బుచ్చిరెడ్డిపాళెంలో మున్సిపల్ కార్యాలయం నిర్మించామని, సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశామని గుర్తుచేశారు. మంగళవారమే హ్యామ్ పథకం కింద రూ.22 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి-67పై రూ.14 కోట్ల వ్యయంతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం-చెన్నూరు రోడ్డు మధ్య మల్దేవి కెనాల్‌పై వంతెన పనులు వేగంగా జరుగుతున్నాయని, నూతనంగా అగ్నిమాపక కేంద్రం నిర్మాణం కూడా శరవేగంగా సాగు తోందని వివరించారు.

**వైసీపీ దోపిడీ వర్సెస్ కూటమి అభివృద్ధి:** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని, ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అడగవచ్చని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం లో కనిగిరి రిజర్వాయరు లీకేజ్, సేపేజ్ అయ్యేలా గ్రావెల్ దోచేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారాయని, వాటిని త్వరలోనే పరిశీలించి అర్హులైన నిరుపేదలకు అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు, సీనియర్ నాయకుల సూచనల మేరకే అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అందరికీ ఒకేసారి అవ కాశాలు ఇవ్వడం సాధ్యం కాదని అందరికీ తెలుసని, పోటీలో ఎవరు నిలబడ్డా పార్టీ గెలుపే ధ్యేయంగా అందరూ ఒక్కటై పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## మెడికల్ హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల జెఏసి నిరసన




**నెల్లూరు జిల్లా, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మెడికల్, హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల జెఏసి పిలుపు మేరకు కాంట్రాక్టు ఉద్యోగులు నెల్లూరు ఏసిఎస్ఆర్ సర్వజన ప్రభుత్వ హాస్పిటల్ నందు శాంతియుతంగా కూర్చొని నిరసన తెలపటం జరిగింది. ప్రభుత్వానికి డిమాండ్ల నెరవేర్చటానికి మేము ఇచ్చిన 30 రోజుల గడువులో కేవలం 11 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని ఈ లోగా ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు అందరూ తమ డ్యూటీ అయిపోయిన తర్వాత మాత్రమే నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం నెల్లూరులో మానవ ఆకృతి నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కేర్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దశల్లో కొనసాగుతున్న ఉద్యమంలో భాగంగా నెల్లూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగులు బుధవారం శాంతియుతంగా కూర్చుని కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, ఈసీజీ టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎక్స్‌రే టెక్నీషియన్లు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు, సీఎస్టీ టెక్నీషియన్లు, ఇతర పారామెడికల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ ఐదు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, రెగ్యులరైజేషన్ జరిగే వరకు 100 శాతం గ్రాస్ శాలరీతో పూర్తి వేతనం చెల్లించాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగికి ఈపీఎఫ్ సౌకర్యం, విధి నిర్వహణలో అనారోగ్యానికి గురైనప్పుడు పూర్తి వేతనంతో కూడిన శెలవు సౌకర్యం కల్పించాలని, ఉద్యోగులకు మ్యూచువల్ మరియు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని రాబోయే రోజుల్లో మరింత ఉద్ధృతం చేస్తామని నాయకులు తెలిపారు.

## తాడేపల్లిలో వైఎస్ జగన్ తో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బేటి



**నెల్లూరు జిల్లా, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** తాడేపల్లిలో మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి తో వైస్సార్సీపీ నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి జిల్లా రాజకీయాలపై చంద్రశేఖర్ రెడ్డితో చర్చించి స్థానిక ఎన్నికల్లో ఏ విధంగా ఉండాలో పలు సూచనలు చేశారు.

## అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలనకు 13 కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రత్యేక కోర్టు వెంటనే
అమల్లోకి తేవాలి
క్యాబినెట్ సబ్ కమిటీకి అభినందనలు
అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్
అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు
ముప్పాళ్ళ నాగేశ్వరరావు

**గుంటూరు, 23 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు రాష్ట్రంలో 13 కేంద్రాలు ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు చంద్ర మౌళినగర్లోని ఆయన నివాసంలో బుధవారం మాట్లాడుతూ అగ్రిగోల్డ్ అంశంపై వేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కొంత పురోగతి కనిపించిందని ముప్పాళ్ళ హర్షం వ్యక్తం చేశారు. క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో సీఐడీ అధికారుల ప్రతిపాదన మేరకు రాష్ట్రంలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, అయితే గతంలో బాధితులు ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా ఉండేందుకు పాత జిల్లాల ప్రాతిపదికన 13 కేంద్రాలు ప్రారంభించాలని ముప్పాళ్ళ విజ్ఞప్తి చేశారు. బాధితులకు చివరి పైసా వచ్చే వరకు అసోసియేషన్ వారికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# ఈసీలో అంతర్యుద్ధం

**కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండానే 'సర్'పై నిర్ణయాలు**
**ఓటర్ల తొలగింపు, తిరిగి చేర్చే విధానంపై సుఖ్‌బీర్ సంధూ, వివేక్ జోషి ప్రశ్నలు**
**వాటిని తేల్చకుండానే సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ నిర్ణయాలు తీసుకున్నారంటూ నోట్**
**ఫారం-6లో మార్పులు 'అనధికారికం, చట్టవిరుద్ధం'**
**ఓటర్ల జాబితాలపై ఈఆర్‌వోల అధికారాలకు కత్తెర**
**తొలగించిన అర్హులను తిరిగి చేర్చేందుకు లేని ఆప్షన్**
**ఇలా పది నెలల్లో అధికారికంగా 14 అభ్యంతరాలు**
**కీలక పత్రాలను ఉటంకిస్తూ ఆంగ్ల పత్రిక కథనం**
**కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు సహజమే: ఈసీ**




**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై బయట రాజకీయ రగడ మాత్రమే కాదు.. ఆ ప్రక్రియలోని పలు అంశాలపై ఎన్నికల కమిషనర్లే అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ అభ్యంతరాలను కాదని మరీ సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ నేతృత్వంలో ఎన్నికల సంఘం ముందుకు వెళ్లిందని తేలింది. ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలను తమకు తెలియకుండానే తీసుకున్నారంటూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం–6లో మార్పులు, పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ కేంద్రీకరణ తదితర అంశాలపై సీఈసీ నిర్ణయాలను 'అనధికారికం, చట్టవిరుద్ధ'మని పేర్కొంటూ పది నెలల్లోనే 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలను నమోదు చేశారు. ఈ అంశాలతో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా సంస్థ పరిశోధనాత్మక కథనం ప్రచురించింది. కేంద్ర ఎన్నికల సంఘం గత ఏడాది జూన్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు 'సర్' ప్రక్రియను తెరపైకి తెచ్చింది. ఈ ప్రక్రియలో పెట్టిన నిబంధనలు, సవరణల కోసం అవసరమైన ధ్రువపత్రాల విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఎవరి ఓటు ఉంటుందో, ఎవరి పేరు తొలగిస్తారో తెలియని గందరగోళం నెలకొంది. అయినా ఎన్నికల సంఘం ముందుకు వెళ్లింది.

ఇప్పటివరకు 30రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సమగ్ర సర్వే నిర్వహించి, 13 కోట్ల పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించింది. అయితే ఆయా అంశాలు, నిర్ణయాలపై ఎన్నికల సంఘంలో పదే పదే ప్రశ్నలు, అభ్యంతరాలు వచ్చాయని.. పలు నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరాలు తెలిపారని తాజాగా వెల్లడైంది. దీనికి సంబంధించి ఎన్నికల కమిషనర్ల మధ్య, కేంద్ర కేబినెట్ కార్యదర్శికి, వివిధ రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారు (సీఈవో)లకు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను ఉటంకిస్తూ ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వివరాలను వెల్లడించింది. ఆ కథనం ప్రకారం.. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు (సుఖ్‌బీర్ సంధూ, వివేక్ జోషి) తమకు తెలియకుండానే సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ నిర్ణయాలు తీసుకుంటున్నారని పలుమార్లు అభ్యంతర వ్యక్తం చేశారు. కొత్త ఓటర్ల నమోదులో చేసిన మార్పులు, తొలగించిన ఓటర్ల పేర్ల పునరుద్ధరణ, సర్ ప్రక్రియలో ఓటర్ల పేర్లను పునరుద్ధరించే నిర్ణయాలపై అప్పీలు, మొత్తం ఓటర్ల జాబితాల భద్రత తదితర అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు.

అందులో ఒకే రోజున నాలుగు అభ్యంతరాలను అధికారికంగా నమోదు చేశారు. ఈ అభ్యంతరాల ప్రతులను సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు పంపారు. అందులో కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన అంశంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు తెలియకుండానే ఎన్నికల సంఘం నిర్ణయం వెలువడిందని.. అది చట్టవిరుద్ధం, అనధికారికం అని స్పష్టం చేశారు. ఇక ఓటర్ల జాబితాలకు సంబంధించి ఐటీ విభాగంలో తమకు తెలియకుండానే మార్పులు చేశారని ఎన్నికల కమిషనర్లు సంధూ, వివేక్ జోషి వేర్వేరుగా కేంద్ర కేబినెట్ కార్యదర్శికి వేర్వేరుగా లేఖలు రాశారు. దీనితో ఆ మార్పును నిలిపివేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో 9న సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు భేటీ అయ్యారు. నాలుగున్నర నెలల్లో వారు భేటీకావడం అదే మొదటిసారి కావడం గమనార్హం.

### ఈసీ నిర్ణయాలపై ప్రశ్నలెన్నో!?

ఎన్నికల సంఘం ఈ ఏడాది జూలైలో కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం–6లో మార్పులు చేసింది. 2002నాటి 'సర్' జాబితాలో మీ తల్లిదండ్రులు/తాతనానమ్మల పేర్లు ఉన్నాయా? అనే ప్రశ్నను చేర్చింది. ఆ ప్రశ్నకు జవాబు ఇవ్వకుండా దరఖాస్తుదారులు ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఈ నిర్ణయం అమల్లోకి రావడానికి ముందే మే నెలలోనే ఎన్నికల కమిషనర్ వివేక్ జోషి దీనిపై అభ్యంతరాన్ని నమోదు చేశారు. ప్రభుత్వం చట్టాలను మార్చకుండా ఈ మార్పును తీసుకురావడం కుదరదని స్పష్టం చేశారు. మరో ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సంధూ కూడా ఈ అభ్యంతరాన్ని సమర్థించారు. ఇద్దరు కమిషనర్లు వ్యతిరేకించినా సరే.. జూలైలో ఆ నిర్ణయం అమల్లోకి వచ్చింది. దీనితో 'ఈ నిర్ణయం చట్టవిరుద్ధం, అనధికారికం. వెనక్కి తీసుకోవాలి' అంటూ సుఖ్‌బీర్ అధికారికంగా ఫైల్‌పై నమోదు చేయడం గమనార్హం. అయినా కొత్తనిబంధన అమల్లోనే ఉంది.

### క్షేత్రస్థాయిలో అధికారాలకు కత్తెర

ఈసీఐ నెట్, ఈఆర్‌వో నెట్ పోర్టల్‌లను ప్రవేశపెట్టిన తర్వాత క్షేత్రస్థాయిలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ)లకు.. ఓటర్ల జాబితాలపై నియంత్రణ లేకుండా చేస్తున్నారని, ఓటర్ల జాబితాలను కేంద్రీకృత డేటాబ్లసగా మారుస్తున్నారని ఎన్నికల కమిషనర్ వివేక్ జోషి ఈ ఏడాది మేలో పేర్కొన్నారు. ఈఆర్‌ఓలు ఇతర చట్టబద్ధ హక్కు ఉన్న అధికారులకు తప్ప ఇతరులు మరెవరికీ ఓటర్ల జాబితాలు సవరించే అవకాశం లేదని తేల్చాలని, ఇందుకోసం ప్రత్యేక ఆడిట్ జరపాలని కోరారు. మరో ఎన్నికల కమిషనర్ సంధూ కూడా ఇదే అంశాన్ని లేవనెత్తారు. తమకు ఈఆర్‌ఓనెట్ పోర్టల్‌లో సరైన యాక్సెస్ ఉండటం లేదని రాష్ట్రాల ఎన్నికల అధికారులు చెబుతున్నారని నోట్ రాశారు. కానీ ఈ అంశాలపై సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ స్పందించలేదు.

### ఈసీ తరఫున అప్పీలు చేసిందెవరు?

పశ్చిమబెంగాల్‌లో చేపట్టిన సర్‌లో ఓట్ల తొలగింపుపై వివాదం చెలరేగింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ట్రైబ్యునళ్లతో ఓటర్ల జాబితాలు, అప్పీళ్లను పరిశీలించి లక్షలాది మంది పేర్లను తిరిగి చేర్చింది. అయితే ట్రైబ్యునళ్లు పునరుద్ధరించిన ఓటర్లను తొలగించాలని కోరుతూ ఎన్నికల అధికారులు 16 లక్షల అప్పీళ్లను దాఖలు చేశారు. అయితే తమకుగానీ, బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో)కు గానీ తెలియకుండానే ఈ అప్పీళ్లు దాఖలయ్యాయని.. అవి ఎవరు చేశారు, ఎవరు అనుమతించారని ఎన్నికల కమిషనర్లు సంధూ, వివేక్ జోషి ప్రశ్నించారు.

### సాఫ్ట్‌వేర్ ఎందుకు తిరస్కరించింది?

ఎన్నికల కమిషనర్లు సంధూ, వివేక్ జోషి లేవనెత్తిన కేంద్రీకృత విధానం గోవాలో అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు దక్కకుండా చేసింది. తల్లిదండ్రులు, బంధువుల పేరు సరిపోకపోవడం, వయసులో అసాధారణ వ్యత్యాసాలు వంటి కారణాలతో ఓటు హక్కు తిరస్కరించిన వారికి మరోసారి పత్రాలు చూపే అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరి 29న ఆదేశించింది. దీనితో ఈఆర్‌ఓలు పరిశీలన జరిపి 97 మంది ఓటర్లను అర్హులుగా గుర్తించారు. అర్హుల ఓటర్ల పేర్లు తిరిగి చేర్చేలా 'రోల్ బ్యాక్' ఆప్షన్ ఇవ్వాలని రాష్ట్ర అధికారులు కోరినా.. ఎన్నికల సంఘం స్పందించలేదు.

### మెజారిటీ నిర్ణయమే కీలకం.. కానీ?

ఎన్నికల కమిషన్‌లో సీఈసీ, ఇద్దరు కమిషనర్లకు సమాన హోదా ఉంటుంది. ఏ నిర్ణయమైనా సరే మెజారిటీతో లేదా ఏకగ్రీవంగా తీసుకుంటేనే అమల్లోకి వస్తుంది. కానీ ఇప్పుడు ఇద్దరు కమిషనర్లు పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం.. ఎన్నికల సంఘం పనితీరునే ప్రశ్నార్థకంగా మార్చేసిందనే విమర్శలు వస్తున్నాయి

### నియామకాల తీరుపైనే అభ్యంతరాలు

పాత ఎన్నికల కమిషన్ చట్టం ప్రకారం.. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, ప్రధాని, ప్రతిపక్ష నేతలతో కూడి ప్యానెల్ ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేస్తుంది. కానీ ఎన్డీయే ప్రభుత్వం 2023లో ఈ చట్టానికి సవరణ చేసి.. ప్యానెల్ నుంచి సుప్రీం చీఫ్ జస్టిసను తొలగించింది. ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ప్రతిపక్ష నేతలతో కూడిన ప్యానెల్ ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసేలా మార్చింది. అంటే ప్రభుత్వం ఎవరిని కోరుకుంటే వారిని నియమించుకునే వీలు ఏర్పడింది. ఈ క్రమంలోనే 2024 మార్చిలో జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ ఎన్నికల కమిషనర్లుగా నియామకమయ్యారు. ఈనియామకాలను అప్పటి లోక్‌సభ ప్రతిపక్ష నేత అధీర్‌రంజన్ చౌదరి వ్యతిరేకించారు. ఇక 2025 ఫిబ్రవరిలో జ్ఞానేశ్‌కుమార్‌కు సీఈసీగా పదోన్నతి ఇచ్చారు. వివేక్‌జోషిని కమిషనర్‌గా నియమించారు. దీనిని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యతిరేకించినా అమల్లోకి వచ్చింది.

# 'ఎల్‌నినో'తో 4.5 లక్షల మరణాలు

**ఫిబ్రవరిలోపు ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రమాదం.. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**
**భారత్‌పైనా తీవ్ర ప్రభావం**
**15,800 మందికి ప్రాణాపాయం**
**క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదికలో హెచ్చరికలు**
**సూపర్ ఎల్‌నినోతో 4.5 లక్షల మరణాలు!**
**వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రమాదం**
**భారత్‌పైనా గణనీయంగా ప్రభావం..**
**రానున్న వేసవి నిప్పుల కుంపటే**



**న్యూఢిల్లీ :** రానున్న నెలల్లో ఎల్‌నినో తీవ్రతరమై సూపర్ ఎల్‌నినోగా మారి, వాతావరణ ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగనున్నాయని.. ఫలితంగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు 4,51,000 మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ఓ అధ్యయన సంస్థ హెచ్చరించింది. అమెరికాకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అనే సంస్థ ఓ నివేదికను విడుదల చేసింది. ఎల్‌నినో వల్ల దక్షిణార్ధగోళంలోని దేశాల్లోనే ఉండటం గమనార్హం. నైజీరియా, సుడాన్, నైగర్, చాద్ తదితర ఆఫ్రికా దేశాల్లో 66,800 మంది, ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్‌లాండ్, కాంబోడియా తదితర దేశాల్లో 19,400 మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, భారత్‌లో 15,800 మంది, బ్రెజిల్‌లో 13,300 మంది మరణిస్తారని తెలిపింది. ఈ మరణాలను నివారించటానికి ప్రభుత్వాలు ఉష్ణోగ్రతలకు సంబంధించిన హెచ్చరికలు జారీ చేయటం, కూలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయటం, ప్రజలకు వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టటం, బహిరంగ స్థలాల్లో పని చేసే కార్మికులకు రక్షణ కల్పించటం, ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయటం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఉత్తరార్ధగోళంలో సెప్టెంబరు–నవంబరు మధ్య ఉండే శరదృతువులో, శీతాకాలంలో అత్యంత తీవ్ర ఎల్‌నినోకు 90శాతం అవకాశం ఉందని పేర్కొంది. "ఎల్‌నినో తీవ్రత ప్రభావం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెల.. చరిత్రలోనే అత్యంత ఉక్కపోత నమోదైన ఆగస్టు నెలగా రికార్డుల్లోకి ఎక్కింది. ఇది వేగంగా తీవ్రతరమవుతున్న ఎల్‌నినోకు, దీర్ఘకాలంపాటు కొనసాగే గ్లోబల్‌వార్మింగ్‌కు సంకేతం" అని అభివర్ణించింది.

### ఖరీఫ్ పంటలకు పెరుగుతున్న ముప్పు

ఎల్‌నినో మరింత బలపడుతుండటంతో రానున్న రోజుల్లో వర్షపాతంలోటు మరింత పెరుగుతుందని, ఇది వ్యవసాయ దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుందని ఐసీఐసీఐ బ్యాంకు నివేదిక వెల్లడించింది. ఈనెల 17వ తేదీ నాటికి దేశంలోని రిజర్వాయర్లలో 71 శాతం మాత్రమే నీరు నిల్వ ఉందని, దక్షిణ భారతంలో ఇంకా తక్కువగా రిజర్వాయర్ల సామర్థ్యంలో 52 శాతం మాత్రమే నీరు నిల్వ ఉందని పేర్కొంది. ఈనెల 21వ తేదీ నాటికి దేశంలో దీర్ఘకాలిక సగటు కంటే 15 శాతం తక్కువగా 704 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపింది. ప్రాంతాల వారీగా చూస్తే.. దక్షిణభారతంలో లోటు 27 శాతం, తూర్పు భారతంలో 26 శాతం, మధ్య భారతంలో 6శాతం, వాయవ్య భారతంలో 10శాతం నమోదైందని పేర్కొంది. మరింత బలపడుతున్న ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయానికి ముప్పుగా పరిణమించనున్నాయని నివేదిక పేర్కొంది.

# దక్షిణాది రాష్ట్రాల మధ్య ఎప్పుడూ కొట్లాటలేనా?

**ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నడుమ ఏళ్ల తరబడి ఎందుకీ జల వివాదాలు?**
**కృష్ణా జలాల పంపిణీ వ్యవహారంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ :** దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక మధ్య ఎప్పుడూ కొట్లాటలేనా అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నీటి పంపకాల వ్యవహారంలో ఏళ్ల తరబడి ఎందుకీ వివాదాలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం ప్రశ్నించింది. జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–2) 2010 డిసెంబరులో ఇచ్చిన అవార్డు ప్రకారం.. కర్ణాటకకు అదనపు నీటి కేటాయింపులు లభించి ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచుకునేందుకు మార్గం సుగమమైంది. అయితే ఆలమట్టి ఎత్తు పెంచితే దిగువకు నీళ్లు రావని.. శ్రీశైలం, నాగార్జునసాగర్, కృష్ణా డెల్టాలకు ఇన్‌ఫ్లో తగ్గి ఆయకట్టు ఎడారిగా మారుతుందని ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఆదేశాలను సవాల్ చేస్తూ 2014లో సుప్రీంకోర్టులో సివిల్ అప్పీల్(సీ.ఏ.) దాఖలు చేసింది. బచావత్ ట్రైబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–1) ప్రకారం ఏపీకి ఉన్న మిగులు జలాల హక్కులను దెబ్బతీసేలా బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు ఉందని, అందువల్ల ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం అధికారిక గెజిట్‌లో ప్రచురించకుండా నిలిపివేయాలని కోరింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ట్రైబ్యునల్ తీర్పుపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా స్టే విధించింది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ సైతం ఈ కేసులో భాగస్వామిగా చేరింది. నాలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం సుప్రీంకోర్టులో కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ సివిల్ అప్పీల్ బుధవారం త్రిసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. విచారణ ప్రారంభం కాగానే.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక(కావేరీ జల వివాదం) మధ్య ఎందుకీ కొట్లాటని కోర్టు వ్యాఖ్యానించింది.

### మా హక్కులను కర్ణాటక హరిస్తోంది: ఏపీ

ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'కృష్ణా దిగువ పరీవాహక ప్రాంతంలో ఉన్న మా రాష్ట్ర ప్రాజెక్టులను కర్ణాటక నిరంతరం వ్యతిరేకిస్తోంది. మా హక్కులను హరిస్తోంది. మధ్యంతర ఉత్తర్వులు వెలువడి 15 ఏళ్లు గడిచినా 'వెకేటింగ్ అప్లికేషన్' ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ప్రధాన సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ఇప్పటికే ప్రాజెక్టులపై రూ.వేల కోట్లు పెట్టుబడి పెట్టినా నీటిని వినియోగించుకోలేకపోతున్నాం. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ కేటాయించిన నీటిలో కేవలం 65 నుంచి 70 టీఎంసీల నీటిని మధ్యంతర ఉపశమనంగా వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతున్నాం. మా ఎగువన ఉన్న రిజర్వాయర్లు పూర్తిగా నిండాయి. అందువల్ల ఈ పిటిషన్‌పై త్వరగా విచారణ జరిపి తగిన ఉత్తర్వులివ్వండి' అని అభ్యర్థించారు. అయితే ఏపీ పేర్కొన్న నీటి లభ్యత గణాంకాలు సరైనవి కావని కర్ణాటక తరఫు సీనియర్ న్యాయవాది తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ వివాదంపై ఒక రోజు పూర్తి స్థాయిలో వాదనలు వినడానికి కోర్టుకు అభ్యంతరం లేదని తెలిపింది. కేసు విచారణను దీపావళి తర్వాత నవంబరు 4న విచారిస్తామని స్పష్టం చేసింది. అయితే ఈ వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టులో ఐదు అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని న్యాయవాదులు తెలిపారు. దీంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన అన్ని పిటిషన్లనూ కలిపి అదే రోజు విచారిస్తామని పేర్కొంటూ ధర్మాసనం విచారణను వాయిదావేసింది.

# నిసర్గకు అరుదైన గౌరవం

**అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్.. హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు**

**న్యూఢిల్లీ :** సీబీఎస్‌ఈ ఈ ఏడాది ప్రవేశ పెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలను బయట పెట్టిన 19 ఏళ్ల నిసర్గ అధికారికి అరుదైన గౌరవం దక్కింది. అమెరికా న్యాయ విభాగానికి చెందిన హాల్ ఆఫ్ ఫేమ్‌లో అతడి పేరును చేర్చారు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ.. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ సిస్టమ్‌లో వారం క్రితం సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన లోపాన్ని కనుగొన్నానని తెలిపాడు. ఈ విషయమై వారికి తెలియజేయగానే దాన్ని సరిచేశారన్నాడు. తాను చేసిన సహాయాన్ని గుర్తించి తన పేరును హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చారని పేర్కొన్నాడు. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్‌జస్టిస్ వెబ్‌సైట్‌ను బ్రౌజ్ చేసినప్పుడు కస్టమ్ స్క్రిప్ట్ లను ఉపయోగించి ఈ లోపాలను కనుగొన్నట్లు చెప్పాడు. దీంతో వెంటనే డీఏజీకి, అమెరికా మిలటరీకి తెలియజేయగా వాటిని సరిచేశారని పేర్కొన్నాడు.

# శ్వేతసౌధంపై 'డ్రోన్ పోర్టు'!

**ట్రంప్ కొత్త బాల్‌రూమ్‌పై డ్రోన్ల స్థావరం ఏర్పాటు యోచన**

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధం భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా మరో కీలక ప్రతిపాదన చేశారు. శ్వేతసౌధంలో నిర్మిస్తున్న భారీ బాల్‌రూమ్ పైభాగంలో ప్రత్యేకంగా డ్రోన్ పోర్టు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. వైట్‌హౌస్, దాని చుట్టుపక్కల ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని ట్రంప్ చెబుతున్నారు. ఈ పోర్టులో క్షిపణులను మోసుకెళ్లగల మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీలు), సాయుధ సిబ్బంది ఉండాలని ట్రంప్ భావిస్తున్నారు. శ్వేతసౌధం 18 ఎకరాల ప్రాంగణంతోపాటు వాషింగ్టన్ నగర భద్రతకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. అయితే, ట్రంప్ ప్రతిపాదిస్తున్న డ్రోన్ పోర్టుకు కొన్ని వందల అడుగుల దూరంలోనే అమెరికా సీక్రెట్ సర్వీస్ ఇప్పటికే మరో డ్రోన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం. ఈ డ్రోన్లు ఆయుధరహితమైనవి. 'డ్రోన్ యాజ్ ఫస్ట్ రెస్పాండర్' విధానంలో ఇవి ఎగిరే కెమెరాల్లా పనిచేస్తాయి.

# ఇరాన్‌కు చెక్ పెట్టేందుకు 'ఐమెక్' వ్యూహం!

**భారత్-మిడిల్ ఈస్ట్- యూరప్ కారిడార్‌కు మద్దతు: ట్రంప్**

**వాషింగ్టన్ :** భారత్, పశ్చిమాసియా, యూరప్ లను రైలు, సముద్రమార్గాల ద్వారా కలిపే 'భారత్– మిడిల్‌ఈస్ట్– యూరప్ ఎకనామిక్ కారిడార్' (ఐమెక్) ప్రాజెక్టుకు అమెరికా అధ్యక్షుడు తన పూర్తి మద్దతు ప్రకటించారు. పొరుగు దేశాల వాణిజ్య నౌకలపై ఇరాన్ జరుపుతున్న దాడులకు ఐమెక్ కారిడార్ ద్వారా చెక్ పెట్టవచ్చని వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలు సందర్భంగా గల్ఫ్ దేశాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చమురు రవాణా వ్యవస్థకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో తరచూ రవాణాకు అంతరాయం కలుగుతుండటంతో, ఇంధన రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించక తప్పదని ట్రంప్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలోని ఇంధన రవాణా వ్యవస్థను ఇరాన్ గుప్పిట్లో నుంచి వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే, తమ కార్యవర్గం ఐమెక్‌తోపాటు ఇతర పైప్‌లైన్ ప్రాజెక్టులను సమర్థిస్తోందని చెప్పారు.

# ఎన్‌సీఎల్‌ఏటీని ఆశ్రయించిన సుభాష్ చంద్ర

**న్యూఢిల్లీ:** జీ టీవీ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా అంశం కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో తుది తీర్పు వచ్చే వరకు తన ఆస్తులను విక్రయించకుండా ఐదుగురు సభ్యుల నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై సుభాష్ చంద్ర నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ను ఆశ్రయించారు. దీంతో చంద్ర దరఖాస్తును పరిశీలించిన ఎన్‌సీఎల్‌ఏటీ.. ఈ అప్పీల్‌లో రుణదాతలను కూడా చేర్చాలని ఆదేశించింది. అనంతరం ఈ కేసు విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. మరోవైపు ఈ కేసులో మరింత స్పష్టత కావాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి ఎన్‌సీఎల్‌టీ నోటీసులు జారీ చేసింది.

# ఐపీఎల్ 2027 వేలానికి వేదిక ఖరారు

**ఈసారి ఇండియాలోనే!**

**డిసెంబర్‌లో ఐపీఎల్ 2027 ఆటగాళ్ల వేలం**

**వేదికగా గోవాను ఖరారు చేసిన బీసీసీఐ**

**మూడేళ్ల తర్వాత తిరిగి భారత్‌లో వేలం నిర్వహణ**

**భారీ వర్షాల కారణంగా మహిళల క్రికెట్ మ్యాచ్ వేదిక మార్పు**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్ వేలంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది డిసెంబర్‌లో గోవా వేదికగా ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా బుధవారం స్పష్టం చేశారు. అయితే, వేలానికి సంబంధించిన కచ్చితమైన తేదీలను ఇంకా వెల్లడించాల్సి ఉంది. గత మూడు పర్యాయాలుగా ఐపీఎల్ వేలం విదేశాల్లోనే జరిగింది. అబుదాబి, దుబాయ్, సౌదీ అరేబియా వంటి నగరాలు ఈ వేలానికి వేదికలుగా నిలిచాయి. అయితే, ఈసారి తిరిగి భారత్‌లోనే వేలం నిర్వహించాలని నిర్ణయించినట్లు సైకియా తెలిపారు. "గత మూడుసార్లు వేలాన్ని అబుదాబి, దుబాయ్, సౌదీ అరేబియాలో నిర్వహించాం. ఈసారి డిసెంబర్‌లో గోవాలో నిర్వహించాలని నిర్ణయించాం" అని ఆయన మీడియాకు వివరించారు. ఇదే సందర్భంలో బీసీసీఐ మరో కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. ఇండియా 'ఏ', ఆస్ట్రేలియా 'ఏ' మహిళా జట్ల మధ్య జరగాల్సిన మల్టీడే మ్యాచ్ వేదికను మార్పు చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా, ఈ మ్యాచ్‌ను పంజాబ్‌లోని మొహాలీకి తరలించారు. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనుంది.

# ఆస్ట్రేలియా బౌలింగ్‌ను ఎదుర్కోవాలంటే అదే కీలకం: గంభీర్



ఆస్ట్రేలియా జట్టులోని అనుభవజ్ఞులైన బౌలింగ్ దాడిని ఎదుర్కోవాలంటే భారత యువ బ్యాటర్లకు నైపుణ్యంతో పాటు మానసిక దృఢత్వం ఎంతో అవసరమని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఒత్తిడిని ఎంతగా తట్టుకోగలిగితే అంత మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని చెప్పాడు. 2027 జనవరి 21 నుంచి మార్చి 3 వరకు భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ జరగనుంది.

### అనుభవజ్ఞులైన బౌలర్లతో పరీక్ష

పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లియాన్ లాంటి బౌలర్లతో కూడిన ఆస్ట్రేలియా బౌలింగ్ విభాగం భారత యువ బ్యాటర్లకు గట్టి పరీక్ష పెట్టనుందని గంభీర్ పేర్కొన్నాడు. నాగ్‌పుర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ వేదికలుగా టెస్టులు జరగనున్నాయి. "టెస్టుల్లో నైపుణ్యం ముఖ్యం. కానీ మానసికంగా ఎంత బలంగా ఉన్నాం? ఒత్తిడిని ఎంతగా భరించగలం? అన్నదే కీలకం. ఒత్తిడిని స్వీకరించి ముందుకు వెళ్లగలిగితే అవకాశాలు మెరుగవుతాయి" అని గంభీర్ అన్నాడు.

### శ్రీలంకలో ముందస్తు సన్నాహాల ఫలితం

కఠిన సిరీస్‌లకు ముందస్తు ప్రణాళికతో సిద్ధమైతే ఫలితాలు స్పష్టంగా కనిపిస్తాయని గంభీర్ చెప్పాడు. శ్రీలంక పర్యటనను ఇందుకు ఉదాహరణగా చూపాడు. అక్కడ టెస్టులకు పది రోజుల ముందే చేరుకుని స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా సాధన చేశామని తెలిపాడు. శ్రీలంకతో ఆడిన రెండు టెస్టుల్లోనూ భారత్ ఇన్నింగ్స్‌కు 400కు పైగా పరుగులు సాధించిందని గుర్తుచేశాడు. అక్కడి పరిస్థితుల్లో అనుభవజ్ఞులైన స్పిన్నర్లను ఎదుర్కొని ఈ స్థాయిలో పరుగులు చేయడం ముందస్తు సన్నాహాల ఫలితమేనన్నాడు.

### టెస్టులకు సమయం ఇవ్వాలి

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియాతో టీ20లు ఆడిన తర్వాత కేవలం రెండు రోజుల వ్యవధిలోనే టెస్టు మ్యాచ్‌కు సిద్ధమయ్యామని గంభీర్ చెప్పాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌కు ముందు కూడా ఆసియా కప్ ముగించుకుని రెండు ప్రాక్టీస్ సెషన్లతోనే టెస్టులోకి వెళ్లామని తెలిపాడు. అందుకే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు తగినంత ముందుగా సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నాడు. ముఖ్యంగా స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవడంపై దృష్టి పెట్టాలని చెప్పాడు.

### టెస్టు క్రికెట్‌కు విలువ ఇవ్వాలి

టీమ్‌లోకి వస్తున్న యువ ఆటగాళ్లు టీ20లతో వచ్చే డబ్బు, ప్రచారం కంటే టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని గంభీర్ అభిప్రాయపడ్డాడు. దేవదత్ పడిక్కల్, మానవ్ సుతార్ టెస్టు క్రికెట్‌పై ఆసక్తి, క్రమశిక్షణతో ఉన్నారని చెప్పాడు.

మానవ్‌ను చాలా కాలంగా వివిధ పరిస్థితుల్లో ఆడిస్తూ తీర్చిదిద్దిన సెలెక్టర్లను, బీసీసీఐని గంభీర్ అభినందించారు. "ఎంత మెరుగ్గా సిద్ధమైతే.. అంత మెరుగైన ప్రదర్శన చేసే అవకాశం ఉంటుంది" అని అన్నాడు.

# ఆసియా క్రీడల్లో మీరాబాయి చానుకు చారిత్రక రజతం..

**భారత్ ఖాతాలో మరో 3 పతకాలు**




జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో నాలుగో రోజు భారత్‌కు చిరస్మరణీయంగా నిలిచింది. వెయిట్‌లిఫ్టింగ్ సూపర్ స్టార్ మీరాబాయి చాను మహిళల 49 కేజీల విభాగంలో చారిత్రక రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల్లో ఆమెకు ఇదే తొలి పతకం కావడం విశేషం. ఈ విజయంతో ఆమె కెరీర్‌లో మరో మైలురాయిని అందుకుంది. ఇదే రోజు మరో చారిత్రక విజయం కూడా నమోదైంది. సాఫ్ట్ టెన్నిస్‌లో జై మీనా కాంస్య పతకం సాధించి, ఈ క్రీడలో భారత్‌కు తొలి పతకాన్ని అందించాడు. సెమీఫైనల్ మ్యాచ్‌లో గాయపడటంతో అతను పోరాటాన్ని కొనసాగించలేకపోయినా, కాంస్యంతో దేశానికి గర్వకారణంగా నిలిచాడు. షూటింగ్ రేంజ్‌లోనూ భారత్ పతకాల వేట కొనసాగించింది. పురుషుల స్కీట్ టీమ్ (అనంత్‌జీత్ సింగ్ నరుకా, మైరాజ్ ఖాన్, భవ్‌తేఘ్ సింగ్ గిల్) కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంతకుముందు మహిళల స్కీట్ జట్టు కూడా ఇదే విభాగంలో కాంస్యం సాధించింది. అయితే, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌కు నిరాశ ఎదురైంది. ఆమె పతకం లేకుండానే వెనుదిరిగింది. ప్రస్తుతం భారత్ ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్యాలతో కలిపి మొత్తం 11 పతకాలతో పట్టికలో 11వ స్థానంలో కొనసాగుతోంది.

# వాళ్లిద్దరూ ప్రపంచ కప్ గెలవాలని దేశం మొత్తం కోరుకుంటోంది: రింకూ సింగ్



విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లీ, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు. "విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం" అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు. ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇక తాను కేవలం టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు. భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్నది తన కల అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత్ తరఫున ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్నా.. మూడు ఫార్మాట్లలోనూ రాణించగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు. కెప్టెన్సీపై కూడా రింకూ స్పందించాడు. యూపీ లీగ్‌లో తన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ గెలిచానని గుర్తుచేశాడు. గత సీజన్‌లో ఐపీఎల్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నానని చెప్పాడు. అజింక్య రహానె, సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్ల నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటున్నానని తెలిపాడు. కెప్టెన్సీలో ఇంకా ఎదగాల్సి ఉందని పేర్కొన్నాడు.

# వైభవ్‌కు అసలు పరీక్ష అక్కడే..

## న్యూజిలాండ్ కోచ్ వాల్టర్ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అసలు పరీక్ష ఎదురుకానుందా? బౌన్సీ పిచ్‌లపై అతడి బ్యాటింగ్‌ను చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు న్యూజిలాండ్ ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. అంతేకాదు.. ఓ కోచ్‌గా వైభవ్‌ను కాస్త ఒత్తిడిలో చూసి, అలాంటి పరిస్థితులను అతడు ఎలా ఎదుర్కొంటాడో తెలుసుకోవాలని రహస్యంగా కోరుకుంటున్నానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ 2025, 2026 సీజన్లలో విధ్వంసక బ్యాటింగ్‌తో వైభవ్ ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది అండర్-19 ప్రపంచకప్‌లోనూ సత్తా చాటాడు. దాంతో జులైలో ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో టీ20ల్లో అరంగేట్రం చేశాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు టీ20లు, జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడికి చోటు దక్కలేదు. అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లో వైభవ్‌కు అవకాశం వస్తే.. న్యూజిలాండ్ సీమ్ అనుకూల పరిస్థితుల్లో అతడి ఆటకు గట్టి పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. "బౌన్సీ వికెట్లపై వేగంగా వచ్చే బంతులను వైభవ్ ఎలా ఎదుర్కొంటాడో చూడాలని ఉంది. ఐపీఎల్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లపై అతడు ఆధిపత్యం చెలాయించడం చూశాం. ఇప్పుడు భిన్నమైన పరిస్థితుల్లో అది ఎలా మారుతుందో చూడాలి. మా పరిస్థితుల్లో అతడికి ఎలా బౌలింగ్ చేయాలో కూడా ఆలోచించాలి. ఓ కోచ్‌గా రహస్యంగా ఆటగాళ్లను కాస్త ఒత్తిడిలో చూడాలని అనుకుంటాం. అలాంటి పరిస్థితుల్లో వారు ఎలా స్పందిస్తారో తెలుసుకోవాలని ఉంటుంది" అని వాల్టర్ చెప్పారు. భారత్‌తో ఆడటం ఎప్పుడూ ప్రత్యేకమేనని వాల్టర్ అన్నారు. స్వదేశంలో ప్రపంచకప్ విజేత భారత్‌తో ఐదు టీ20లు ఆడటం తమ ఆటగాళ్లకు మంచి అవకాశమని పేర్కొన్నారు. ఇక ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఎదురైన ఓటమి గురించి స్పందిస్తూ.. అది ఉన్నప్పటికీ ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచన లేదన్నారు. న్యూజిలాండ్ తరఫున గర్వంగా ఆడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు ప్రణాళిక ఇప్పటికే స్పష్టంగా ఉందని వాల్టర్ తెలిపారు. రాబోయే ఏడాదిన్నరలో అవసరమైన చిన్న మార్పులు మాత్రమే చేస్తామని చెప్పారు.





# ‘ఆ రోజు మా జీవితాలనే మార్చేసింది’..

## చిరంజీవిపై రామ్‌చరణ్ ఎమోషనల్ పోస్ట్

మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలోకి అడుగుపెట్టి 48 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, హీరో రామ్‌చరణ్ భావోద్వేగ పోస్ట్ చేశాడు. తండ్రి సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నాడు. 50 ఏళ్ల మైలురాయిని కలిసి జరుపుకునే రోజు కోసం ఎదురుచూస్తున్నానని చెప్పాడు. “నాన్నా.. మీరు సినిమాల్లోకి వచ్చి 48 ఏళ్లు పూర్తయ్యాయి. మా కుటుంబం మొత్తాన్నీ మార్చేసిన ఆ రోజును మేం ఎప్పటికీ గుర్తు చేసుకుంటాం. మీరు చేసిన ప్రతిదానికీ కృతజ్ఞతలు. ఇన్నేళ్లుగా మీపై ప్రేమ చూపిస్తున్న ప్రేక్షకులకు కూడా ధన్యవాదాలు. మీ ప్రయాణం ఎప్పటికీ మాకు స్ఫూర్తే. ఇప్పుడు 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని జరుపుకొనే రోజు కోసం ఎదురుచూస్తున్నా” అని చరణ్ పేర్కొన్నాడు. చిరంజీవి 1978లో ‘ప్రాణం ఖరీదు’ సినిమాతో తెరపైకి వచ్చాడు. అప్పటి నుంచి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించాడు. అగ్ర కథానాయకుడిగా ఎదిగాడు. మెగాస్టార్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. 48 ఏళ్ల ప్రస్థానం పూర్తైన సందర్భంగా చిరంజీవి కూడా అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. తనకు అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, కొత్త పాత్రలు చూపించిన దర్శకులు, తోటి నటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు చెప్పాడు. అయితే విజయాలు, అవార్డుల కంటే అభిమానులు తనపై చూపించిన ప్రేమే ఎంతో గొప్పదని చిరంజీవి అన్నాడు. అభిమానులు తనను కుటుంబ సభ్యుడిగా భావించడం తనకు ఎంతో విలువైన విషయమని చెప్పాడు. వారి ప్రేమ వల్లే ‘చిరంజీవి’ అనే పేరు తనకు శాశ్వత గుర్తింపుగా మారిందని పేర్కొన్నాడు.

# తన పార్ట్ పూర్తి చేసేసిన సూపర్ స్టార్!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా ప్రియాంక చోప్రా అలాగే పృథ్వీరాజ్ సుకుమారన్ లాంటి భారీ తారాగణంతో గ్లోబల్ దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న మహాకావ్య చిత్రం వారణాసి. గ్లోబల్ ఆడియెన్స్ నే టార్గెట్ గా భారీ హంగులతో తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ మాత్రం అనుకున్నట్టుగానే శరవేగంగా పూర్తి చేసుకుంటుంది. అయితే ఈ సినిమా హీరో సూపర్ స్టార్ మహేష్ బాబు తన పార్ట్ వరకు మొత్తం షూట్ ని ఇప్పుడు పూర్తి చేసుకున్నట్టు తెలుస్తుంది. సో ఇక నుంచి మహేష్ బాబు ఫ్రీ అయిపోయినట్టే అని చెప్పాలి. అలాగే మిగతా షూట్ అంతా కూడా ఈ అక్టోబర్ మొదటి వారంతోనే పూర్తి కావడం గ్యారెంటీ.. ఇక ఈ భారీ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే ఎస్ ఎస్ కార్తికేయ, కే ఎల్ నారాయణ నిర్మాణం వహిస్తున్నారు.





# పింక్ కార్సెట్ గౌనులో ఖుషీ కపూర్.. ఫేరీ ప్రిన్సెస్ లుక్‌తో రచ్చ!

దివంగత లెజెండరీ నటి శ్రీదేవి, ప్రముఖ నిర్మాత బోనీ కపూర్‌ల చిన్న కుమార్తె, యంగ్ బాలీవుడ్ బ్యూటీ ఖుషీ కపూర్ తాజాగా షేర్ చేసిన పిక్స్ ఇంటర్నెట్‌లో విపరీతంగా హల్‌చల్ చేస్తున్నాయి. మోడ్రన్ పింక్ గౌనులో దేవకన్యలా మెరిసిపోతూ ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. అక్క జాన్వీ కపూర్ బాటలోనే గ్లామరస్ లుక్స్‌తో అలరిస్తున్న ఈ చిన్నది, తాజాగా పంచుకున్న లగ్జరీ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచి ఫ్యాన్స్ మనసులను దోచేస్తున్నాయి.. తాజా ఫోటోషూట్ కోసం ఖుషీ కపూర్ ప్రసిద్ధ డిజైనర్ ‘మనీష్ మల్హోత్రా’ కౌచర్ లైన్‌కు చెందిన ‘సాఫ్ట్ పింక్ టెక్స్చర్డ్ కార్సెట్ గౌన్’ను ఎంచుకుంది. ఇక స్ట్రక్చర్డ్ కార్సెట్ బోడిస్, ఫ్లోరింగ్ డ్రేప్స్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్ ఆమెకు కంటెంపరరీ ఫేరీ-ప్రిన్సెస్ లుక్‌ని తెచ్చిపెట్టింది. పింక్ షేడ్‌లో ఎంతో క్లాసీగా ఉన్న ఈ డ్రెస్‌లో ఖుషీ ఎంతో గ్లామరస్‌గా మెరిసిపోయింది. ఈ లగ్జరీ పిక్స్ షేర్ చేస్తూ ఖుషీ కపూర్ “నాకిష్టమైన గౌనులో ఫేరీ ప్రిన్సెస్ డ్రీమ్స్‌ను ఆస్వాదిస్తున్నా ” అంటూ స్పెషల్ క్యాప్షన్ ఇచ్చింది. ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్ అవ్వగా, అభిమానులు “సో ప్రెట్టీ ఖుషీ”, “గోర్జియస్ లుక్”, “అచ్చం దేవకన్యలా ఉన్నావ్” అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తూ లైకులతో ముంచెత్తుతున్నారు.

# రాకాలో రష్మిక.. ఇంత ఛాలెంజింగ్ రోలా?

రష్మిక మందన్న కెరీర్‌ను గమనిస్తే.. ఒక్కో సినిమాతో ఆమె తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తోంది. స్టార్ హీరోల సరసన గ్లామర్, లవ్ ట్రాక్‌లకు మాత్రమే పరిమితం కాకుండా యాక్టింగ్ కు ప్రాధాన్యం ఉన్న పాత్రల వైపు కూడా ఆమె అడుగులు వేస్తోంది. ఇప్పుడు అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న రాకాలో ఆమె భాగం కానుందనే వార్తల నేపథ్యంలో మరో ఇంట్రెస్టింగ్ డిస్కషన్ మొదలైంది. ఈ సినిమాలో రష్మిక క్యారెక్టర్ ఇప్పటివరకు ఆమె చేసిన క్యారెక్టర్లకు పూర్తి భిన్నంగా ఉండొచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ క్యారెక్టర్ లో రెగ్యులర్ హీరోయిన్ షేడ్స్ కంటే కథకు ఉపయోగపడే స్ట్రాంగ్ యాంగిల్ ఉంటుందనే టాక్ ఆసక్తిని పెంచుతోంది. కొన్ని సీన్స్ లో నెగటివ్ టచ్ కనిపించినా.. దాన్ని పూర్తిస్థాయి నెగటివ్ క్యారెక్టర్‌గా చూడలేమనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ఒక క్యారెక్టర్ ను మంచిదా, చెడ్డదా అనే రెండు కోణాల్లో కాకుండా.. కథలో దాని అవసరం ఏంటి అన్నది కీలకంగా మార్చడంలో అట్లీకి ప్రత్యేకమైన శైలి ఉంది. అందుకే రష్మిక పాత్ర విషయంలో కూడా అసలు ట్విస్ట్ ఏంటి? ఆమె పాత్ర కథను ఏ స్థాయిలో ప్రభావితం చేస్తుంది? అనే ప్రశ్నలు ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇక రష్మిక కెరీర్ పరంగా చూస్తే రాకా మరో కొత్త ప్రయోగంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటివరకు ఆడియన్స్ ఆమెను విభిన్నమైన పాత్రల్లో చూసినప్పటికీ, కథలో కీలకమైన మలుపులకు కారణమయ్యేంత స్ట్రాంగ్ క్యారెక్టర్‌లో చూడటం మాత్రం కొత్త అనుభూతిని ఇవ్వొచ్చనే డిస్కషన్ జరుగుతోంది. అదే నిజమైతే నటిగా ఆమె పరిధిని మరింత విస్తరించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పాత్రకు సంబంధించిన వివరాలను చిత్రబృందం పూర్తిగా బయటపెట్టకుండా సస్పెన్స్‌ను కొనసాగించడం కూడా సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342